

మహాలక్ష్మి

కాళ్ళూరి వెంకటరామారావు గారు

౧

"ఇదుగో! యేంచేస్తున్నావు లోపల. తలుపు ఓమారు తియ్యి" అని జగన్నాథము ఉదయము పదకొండుగంటలకి రామచంద్రపురంలో తనయింటితలుపు తట్టెను. శేషమ్మ యింకొకకొంతసేపటికి తలుపుతీయుటతోడనే యిద్దరును లోపల ప్రవేశించినారు.

శేషమ్మ—అదేమిటి! అంత అదావిడిగా వస్తున్నారు? చేతులో ఆఉత్తరంయేమిటి? మావాళ్లదగ్గిరనుంచేనా? అంతా క్షేమంగా ఉన్నారుగద?

"ఆఉత్తరం యేమిటి? మావాళ్లదగ్గరమంచేనా? అంతా క్షేమంగా ఉన్నారుగద!''

జగన్నాథము—వచ్చిన ఉత్తరాలన్నీ మీవాళ్ల దగ్గిర్నుంచేనా యేమిటి? ద్రాక్షారంనుంచి మాఅక్కయ్య నరసమ్మ రాసింది. పిల్లకి కార్యంచేసేయ్యాలని చాల తొందరపడుతూంది. రేపు తదియనాడు ముహూర్తముట; ఏం? వింటూన్నావా?

శే—ఆ! ఆవిడ తొందర నిత్యం ఉండేదేలేస్తురూ. సంవత్సరమైందో లేదో పిల్లయీడేరి. అప్పుడే యిలా కొట్టుకుంటే యెలాగవుతుంది?

జ—యీవుత్తరంధోరణిచూస్తే యీమారు యేమీ ఆగేటట్టు కనపడదు. ఆవిడ చాలా పట్టుదల మనిషి. ఎలాగో సంవత్సరం యీడ్చుకొచ్చేంగదా? ఎప్పుడైన చెయ్యవలసిందే కాని మనపిల్ల మనయింట్లో యెల్లకాలం ఉంటుందా యేమిటే?

అని జగన్నాథం నరసమ్మ వ్రాసిన ఉత్తరము పూర్తిగా శేషమ్మకు చదివి వినిపించినాడు. ఎంతోసేపు బోధపరచగా శేషమ్మ చివరకి పిల్లకి కార్యంచేయుటకు ఒప్పుకొన్నది.

జగన్నాథము కొంతసేపు తనగదిలో యేవో కొన్ని గ్రంథములుచదువుకొని శేషమ్మ పిలుచుటతోడనే భోజనార్థము లేచెను.

౨

జగన్నాథము రామచంద్రపురమున- మంచిపలుకుబడిగల వైద్యుడు. ఈవృత్తి ఆతనితండ్రి తాతలనుండియు వచ్చుచున్నదే కాని క్రొత్తది కాదు. ఔషధప్రయోగమునందేమి, హస్తమందేమి జగన్నాథ మతిచతురుడు. ఆయన అనిన ప్రజలకునమ్మక మెక్కువ. ఎంతప్రాణోపద్రవకరములైన వ్యాధులైనను జగన్నాథుడు పేరు చెప్పినచో సరే. చుట్టుప్రక్కలలో నెంతదూరమందైనను, ఎంత

అర్ధరాత్రివేళలనైనను—ఆపద—అనుమాట అతని చెవిలో పడినంతమాత్రమున తక్షణం రెక్కలు కట్టుకుని అక్కడవ్రాలినాడన్నమాటే.

ఎఱ్ఱంచుల పాటినూలుఖండువా తలపాగా చుట్టి, వేరొక జలతారుఖండువా మడతవిప్పకుండ భుజముపైన వేసుకొని, ప్రాతగొడుగును, పెద్దలనాటి మందుల సంచిని చంకనుపెట్టి, కిర్రుచెప్పులతో, కుక్కమూతి చేతికర్రతో జగన్నాథము ప్రత్యక్షమయే సరికి ఎంతయాపదయందున్నవారికైనను భగవంతుడు వచ్చినట్లుగానుండును.

దీనికితోడుగా ఆయన దయార్ద్రహృదయప్రవృత్తివల్లనో, ఆయన అమృతహస్తప్రభావమువల్లనో యింతవరకూ అతనిచేతిమాత్రకు తిరుగులేకుండా పనిజరుగుచున్నది.

పిత్రార్జితమగు ఆస్తికాక జగన్నాథము వరి ఏబదియెకరముల పల్లపుభూమిని స్వశక్తివల్ల సంపాదించినాడు. రామచంద్రపురమున నితని లోగిలి సౌఖ్యమునకును, సౌందర్యమునకును నెలవు. వీధిసావడిలో నిత్యము వందలకొలది మనుష్యులు ఔషధములకోసము పడిగాపులు పడియుందురు.

ఇతనికుమార్తె మహాలక్ష్మికి యిపుడు పదునైదవయేడు. కుమారుడు నరసింగరావునకు పదిసంవత్సరములు. వీరిద్దరుమాత్రమే అతని సంతానమున కంతకును మిగిలినవారు.

మహాలక్ష్మి నల్లరూపున మంచికళ కాంతులు గల పిల్ల. చేరడేసికన్నులు, తీర్చైనముఖము, అవయవపరిపుష్టి గలిగి ఆమెచక్కదనము పూర్ణమై దర్శనీయమై యున్నది.

మహాలక్ష్మి యామె మేనత్తకుమారుడగు రమణారావున కిచ్చి వివాహముచేయబడి మూడుసంవత్సరములైనది. వివాహము కాకముందే రమణారావును తన గృహమున నుంచుకొని జగన్నాథము రామచంద్రపురమున విద్యాబుద్ధుల నేర్పించెను. పెండ్లిఅయిన కొద్దిరోజులకు, అతడింకను ౬-వ ఫారము పూర్తికాకుండనే నరసమ్మ కుమారునిచదువుమానిపించి ద్రాక్షారామమునకు పిలిపించుకున్నది. ద్రాక్షారామము కరణీకము రమణారావుదే.

రమణారావు విద్య యీరీతిగ చెడిపోవుట జగన్నాథమున కిష్టములేదు. కాని యేమిచెయ్యకలడు! నరసమ్మ పూర్వాచారపరాయణురాలు. ఆమె తమ్ముడగు జగన్నాథము హితములను పెడచెవిని బెట్టినది. ఆతడెన్నిసారులు బోధపరిచినను "ఆ! మావాడికీ చదువుచాల్లే. యేదో యింతతినడానికి లోటులేకుండా ఉందిగనుక తింటూ కరిణీకం చేసుకుని బ్రతుకుతాడులే. ఉన్న ఒక్కనలుసూ నాకళ్లకుదూరమైపోతే నేనేంచేసేది?" అనిజవాబిచ్చేడిది. ఆమె గుణమెరిగినవాడు కావున జగన్నాథము చెప్పిచెప్పి ఊరుకొన్నాడు. ఇంతలో మహాలక్ష్మి ఈడేరుటయు తరువాతకథయు మన మెఱిగిన విషయమే.

3

సరిగాఅనుకున్న నాటికి మహాలక్ష్మికి పునస్సంధాన మహోత్సవము జరిగినది. ఆమె మొదటిసారి అత్తవారింటికి వెళ్లినెలరోజు లుండివచ్చినది. ఇంటికివచ్చి పదిరోజులయినదోలేదో తక్షణము పిల్లనుపంపమని నరసమ్మ అప్పుడే నాలుగైదుమారులు ఉత్తరములువ్రాయించినది.

మొదటిసారి కాపురానికి మహాలక్ష్మి వెళ్లినప్పుడే నరసమ్మకోడలిని యేలుబడిచేయు విషయమున శ్రద్ధ చేయక కొంత ఢాకా కనపరిచెను. కోడలువచ్చిన మరునాటినుండియు గృహకృత్యములన్నిటియందును నరసమ్మ వైరాగ్యము పూని మహాలక్ష్మి కిచ్చివేసినది. కాని తప్పులుపట్టు పనిమాత్రము తాను పూర్తిగా నిలుపుకున్నది.

ఒకనాడు మహాలక్ష్మి యింట్లో పను లన్నియు పూర్తియైన తర్వాత ఒక్కసారి పుస్తకము పట్టుకుని చదువుకొనుటకు కూర్చునేసరికి నరసమ్మవచ్చి "ఆ! చాల్లే చదువు. ఇదివరకు చదివినచదు వీఉద్యోగానికి చాలు. చదువులొచ్చేక ఆడవాళ్లు బొత్తిగా హద్దుమీరి పోయేరు. మావాడిన్ని పోకిళ్లు లేవమ్మా! భయం భక్తి లేక పోతేసరి. ఆడపిల్లలకి చదువెందుకురా అని యెన్నిసార్లు చెప్పినా వినక జగన్నాథం పాడుచేసేడు" అని కల్లెర్ర చేసినది. పాపము మహాలక్ష్మి గడగడలాడుచు పుస్తకమొకమూల పారవేసి ఊరకొన్నది. ఆమె బహునేర్పుతో నేర్చుకున్న కుట్టుపని చేయబోయేసరికి నరసమ్మ కేవో లేనిపోనిపనులు కనబడుచుండెడివి.

మొదటిసారియే యింతపని జరుగుటచేత అమాయకురాలగు మహాలక్ష్మి హడలిపోయినది. తల్లిదండ్రుల దగ్గిర అతిముద్దుగా పెరిగిన దాఅమ్మాయి. జగన్నాథము పైనికాని, మేనల్లుడగు నరసింగరావు పైనిగాని ఉన్నఅభిమానము నరసమ్మకు మేనకోడ లగు మహాలక్ష్మిపైన్ని లేకపోయినది. కోడ లగుటయేకాబోలు లందుకు కారణము ?

నరసమ్మ అన్నిరీతుల కోడంట్రికము పెట్టుచున్నను ప్రేమపూరితహృదయు డగు ప్రాణేశ్వరుని సమాదరణ మహాలక్ష్మికి పూర్తిగాకలదు. తల్లి యెదుట నిలిచి యెదురుమాటలాడు సాహసము లేకపోయినను, రమణారావు మహాలక్ష్మిని యేకాంతమున నోదార్చుచుండెడివాడు. హృదయేశ్వరుని నిర్మలప్రేమ తనసొమ్ముకదా యను తలపుమాత్రము మహాలక్ష్మి కత్తింట్లో ఊరట కలిగించెడిది.

౪

రెండవసారి మహాలక్ష్మి ద్రాక్షారమమునకు పంపబడెను. ఈమధ్యను రమణారావును ఒక్కసారి పంపమని జగన్నాథము నరసింగరావును మూడుసారులు ద్రాక్షారామమునకు బంపెను. కాని నరసమ్మకుమారుని పంపుట కిష్టపడలేదు. మేనల్లుడు తన తండ్రిపేరువా డగుటచేత నరసమ్మ నరసింగరావునకు వేయివిధముల మర్యాదచేసి అభిమానము పడెడిది. కాని రమణారావును పంపమను సరికిమాత్ర మామెకు కష్టముగా కనపడెడిది. అందుచే జగన్నాథము సాధనోపాయముగానక మహాలక్ష్మిని ప్రయాణముచేసి అత్తవారింట దిగబెట్టినాడు.

కోడలు యింటప్రవేశించినపుడు నరసమ్మ ఆమెను పలుకరించనైనను లేదు. మహాలక్ష్మి తిన్నగ గదిలోనికి బోయినది. రమణారావు నిండారుప్రేమతో హృదయేశ్వరిని కౌగిటంజేర్చి యశ్రువులు రాల్చినాడు. మహాలక్ష్మికి కూడ దుఃఖ మాగలేదు. చిరవియోగానంతర గాఢపరిష్వంగ సుఖమునమైమరచి ఆయువతీయువకు లట్లేకొంతసేపుండిరి

ఇంతలో నరసమ్మ గది యవతలనుండి "ఏమియునా! అవతలమున్నలూ వాళ్లూ నీకోసం కనిపెట్టుకూర్చుంటే నువ్వింట్లోఉండిపోతే యెలాగ? అవతల పనులు ముందుచూసుకో, గదిమాటకేం? గది యెక్కడికీ పారిపోదు" అన్నది.

నిజభార్యాపరిరంభణమున తన్మయుడై యున్న రమణారావునకు మెలకువవచ్చినది. మహాలక్ష్మికి తానున్నది అత్తిల్లుగాని జన్మగృహముకాదని జ్ఞప్తికి వచ్చినది. ఇద్దరును తత్క్షణము గదిదాటి పైకివచ్చిరి. రమణారావు వీథిలోనికి పోయినాడు. మహాలక్ష్మి గృహకృత్యములలో మునిగిపోయినది.

రమణారావు పై అధికారులదగ్గరనూ, గ్రామములోను మంచిమర్యాదస్థు డనిపించుకొనెను. కరణికపువిధులు చురుకుగా నిర్వర్తించుచు నలుగురు కరణములలో తెలివిగలవా డనుపించుకొనినాడు. సాంఘిక్కీ, చాకర్లకీ యేమియు లోటులేదు.

ఉదయముననే లేచి కాల్యకృత్యముల నిర్వర్తించుకొని పెరటిలోనున్న పూలమొక్కలకును, కూరకాయల చెట్లకును మహాలక్ష్మిసహాయముతో నాతడు నీళ్లు పోయుచుండెడివాడు. బాలభానుని అరుణకిరణములు తనవిశాలఫాలముపై ప్రతిఫలించుచుండ, మహాలక్ష్మి గమనాలసయై కలశమున జలముదెచ్చి భర్త కందించుచుండెడిది. ఉదయమున లక్ష్మీనిలయమైన యాపూలతోటమధ్య నాదంపతులను జూచినవారికి ప్రణయదంపతులగు "సీతారాములు" జ్ఞప్తికిరాక మానరు.

తాను పెంచినట్లుపుష్పించి కాయలు కాచినపుడు రమణారావు సంతోష మింతంతకాదు. దినమును ఉదయమున కూరగాయలు స్వయంగా కోసితెచ్చి తరుగమని మహాలక్ష్మికి అతడిచ్చుచుండువాడు. సాయంసమయమున పుష్పములుతెచ్చి ముడుచుకొమ్మని యిచ్చుచుండును. మామిడిచెట్టున పండినపండుతెచ్చి ముక్కలుచేసి యింటఅందరకును సరిగా పంచిపెట్టుచుండును.

ఇంటికి సరిపోవునన్ని కూరగాయలు స్వల్పె అగుచున్నవికదాయని నరసమ్మ మహాలక్ష్మిని ఆపనినుండి మాత్రము అడ్డుపెట్టలేదు.

౫

మహాలక్ష్మి రెండవసారి ద్రాక్షారామము వచ్చిఆరు నెలలు కావచ్చినది. విజయదశమిపండుగకు అల్లుని కూతు

గుని తీసుకురమ్మని నరసింగరావును జగన్నాథము పంపినాడు. నరసమ్మ కుమారుని పంపకపోవుట సరికదా కోడలినిసహితమ్ము పంపుటకు వీలులేదని ఖండితముగా చెప్పివేసినది.

"మహాలక్ష్మి గమనాలసయై.......భర్త కందించుచుండెడిది."

సంక్రాంతిపండుగకు గూడ నిదేరీతిగ జరిగినది. శేషమ్మ పాపము కుమార్తెనుచూచి వచ్చుటకై ద్రాక్షారామ మెన్నిసారులో ప్రయాణమైనను జగన్నాథము అడ్డుపెట్టుచుండెడివాడు. నరసమ్మనే పట్టుదలమనిషిఅనుకుంటే ఆమెకంటెను పట్టుదలమనిషై పోయినాడు జగన్నాథము. "మనపిల్లాణ్ణి యెన్నిమార్లు పంపినా ఒక్కమారు పిల్లని పంపని దానింటికి నువ్వెలాగళ్తావు; సిగ్గులేదూ?" అని భార్యని కూకవేయుచుండెడివాడు జగన్నాథము. శేషమ్మ యేమిచేయుటకును తోచక కుమార్తె కొరకు బెంగపెట్టుకుని కంట నీరుకార్చుచుండెడిది.

క్రమక్రమముగా రమణారావున కింటిలోని పోరు ఎక్కువై పోయెను వీధిలోనివ్యవహారములుచూచుకొని విసుగెత్తి యింటికివచ్చేసరికి అతని మనస్సునకు శాంతిలేకపోయెడిది. నరసమ్మ ఏలుబడి అంతకధికమై పోవుచుండెను. నేరముండినను లేకపోయినను గూడ కోడలిని చూచునప్పటికి కామెకు "నల్లేరుపైబండి" సామ్యమైనది. కుమారుని సౌఖ్యము నామె గమనించుటలేదు. చుట్టుప్రక్కల గృహములలో చెప్పుకొనుచున్నమాటల నామె లక్ష్యపెట్టలేదు. సహజ సదయహృదయుడైన తమ్ముని ముఖమైనను ఆమె చూడక పోయెను. ఆమె తన దృష్టినంతను కోడలిని యేలుబడిచేయు విషయమున కేంద్రీకరించినది. కుమారునితో కోడలుపైన నేరములు చెప్పుచుండెడిది. అత డేమియును భార్యనునకపోవుట చూచి యామె మరింత మండిపడెడిది. కొడుకును కోడలును ఒకగంట కాలము విలాసముగ గదియం దుండినచో నామె కట్టలుతెంచుకొనెడిది. "మొగుణ్ణి వలలోపడేసుకుందమ్మా! వాళ్ళిద్దరూ ఏకమై పోయేరు. ఇంక నేను ఏ నుయ్యో గొయ్యో చూసుకోవలసిందే" అని ఆమె నిష్ఠురము ఇరుగు పొరుగులతో ముచ్చటించుచుండెను. ఈవిధముగ నామె నిరంకుశత్వము భరింప శక్యముగాక పోయినది.

అమాయకురాలగు మహాలక్ష్మి ఒక్కనాడైనా భర్తతో అత్తగారు పెట్టు బాధలను గురించి చెప్పలేదు. కాని రమణారావు మాత్ర మీ సంగతినంతను కనిపెట్టినాడు. తనకొరకుగదా పరమసాధు వగు మహాలక్ష్మి యిన్ని బాధల నందుచున్నది? దీని కేదైన సాధన మాలోచించి మహాలక్ష్మి బాధలను నివారింపకున్నచో, ఆపాపమంతయు తనదని యాతడు గ్రహించినాడు. అది మొదలు అత డనేకవిధములగు నాలోచనలలో మునిగిపోవుచుండెడివాడు.

౬.

రమణారావున కింక నింటిలో నుండుట కష్టమై పోయినది. అకారణముగ పరమసుగుణశీలినియగు మహాలక్ష్మిని తల్లి బాధించుట నాతడు చూడలేకపోయెను. ఇంటకలతలు తగ్గుమార్గ మగుపడలేదు. భార్య నొకకొంత కాలము రామచంద్రపురము పంపుటకు తల్లి ఒప్పుకొనదు. నిరంకుశత్వము మానదు. తెగించి చివరకు భార్యనుగాని తల్లినిగాని యెవరినో యొకరిని కొంతకాలము

విడిచిపెట్టకుండినచో నీవ్యవహారము స్థిరపడదని యాతడు నిశ్చయించెను. తత్‌క్షణమే కరణీకపుటుద్యోగమునకు రెండు సంవత్సరములు సెలవు పెట్టినాడు.

ఒకనాటియుదయము ఎనిమిదిగంటలకు రమణారావు యింటిముందొక రెండెడ్లబండి వచ్చి నిలిచినది. తత్‌క్షణము మహాలక్ష్మియు, రమణారావును ఎక్కగా బండి సాగినది.

నరసమ్మ ఆశ్చర్యమునకు మేరలేదు. తన నిరాఘాట నిరంకుశత్వమున కన్నడుగాని యెదురాడియెరుగని కుమారుడిట్లు తనతో చెప్పకుండ భార్యతోగూడ ప్రయాణమైపోవునని యామె కలలోనైన ననుకొనలేదు. కుమారునిమాటకేమి? కోడలైనను "అత్తా, వెళుతున్నాను" అని చెప్పినపాపమున బోలేదు. తీవ్రబుద్ధిగల నరసమ్మకు శృంగభంగమైనట్లైనది. ఆమె యేదియో కొంప మునిగిపోయినట్లేడ్చినది.

ఇరుగుపొరుగు లమ్మలక్కలు నరసమ్మ చుట్టుచేరి ఓదార్పనారంభించిరి. ఈ ఓదార్పు లన్నియూ నరసమ్మ కోపాగ్నిపై నాజ్యధారలైనవి. "ఏమిటో! ఉన్నంతకాలం కొడుకునీ కోడలినీ ఒక్కనాడైనా సుఖపడ నిచ్చిందమ్మా? రాక్షసిలాగ యేలుబడిచేసికొని తినేసిందిగాని. పాపం! మహాలక్ష్మి నిజంగా మహాలక్ష్మిలాంటిదేనమ్మా; ఆ అమ్మాయిగనక భూదేవిలాగ ఓర్చుకొంది. ఇంకొకర్తిఅయితే యీపాటికి యిల్లుమూడు ముక్కలూ నాలుగుచెక్కలూ అయివుండును. పాపం, యీ పోరుపడలేక రమణారావు చివరకి తెగించేడు" అని తిరిగిపోవునపుడు వారిలోవారు ముచ్చటించుకొనుచు సాగిపోయిరి.

"మహాలక్ష్మి అశ్రుగళితనయనములతో... తల్లికౌగిటిలోనికిబోయినది."

౨

ఆనాడే రమారమి పదకొండుగంటలగుసరికి రామచంద్రపురములో జగన్నాథము గారియింటిగుమ్మము ముందు బండి నిలచినది. రమణారావును, మహాలక్ష్మియును అందునుండి దిగి యింటిలోనికి బోయిరి. మహాలక్ష్మి అశ్రుగళితనయనములతో చప్పున తల్లి కౌగిటిలోనికిబోయినది. మాతృప్రేమవాహిని యిరు ...ను దాటి పొంగిపొరలి శేషమ్మకండ్ల నుండి ధారారూపముగా బయలుదేరి మహాలక్ష్మి మూర్ధమును ముంచివేసినది.

తలవనితలంపుగ కుమార్తెయును అల్లుడును వచ్చుటచేత జగన్నాథము "దీనికేదో తగినకారణం ఉండాలి" అనుకున్నాడు. జగన్నాథమునకు రమణారావు నమస్కారమొనర్చెను. అల్లుడు కూర్చొనినతర్వాత "అబ్బాయీ! నువ్విలాగైపోతావని నే ననుకోలేదుసుమా! నరసింగరావుని యెన్నిమార్లు పంపినా ఒక్కమారూ పిల్లని పంపడానికి నీకు ధైర్యంలేకపోయింది. నీతల్లి మూర్ఖురాలైతే నీకైనా ధైర్యం ఉండొద్దూ? నువ్వు చదువుకున్నవాడివేమో, నీతెలివితేటలెక్కడికి పోయేయి?" అని మేనల్లునిదగ్గరనున్న చనువున కోపము చేసినాడు.

రమ:—మామయ్యా! నన్నేంచెయ్యమంటావు? ఆవిడ ముందర ఎదిరించి మాట్లాడ్డం నాకెన్నడూ అలవాటు లేదు. నేను మీపిల్లని పంపమన్నా ఆవిడ కిష్టంలే

నప్పుడు యేంలాభం ఉంటుంది? కోసకి యింట్లో అల్లరులు భరించలేక తెగించి బైలుదేరి యీలాగొచ్చేసేం. ఇంతకంటే నా కేంచెయ్యడానికీ తోచలేదు.

అని రమణారావు కొన్నివివరములు చెప్పిన తర్వాత జగన్నాథమ్మ శాంతిపొందినాడు.

౫

ఐదారురోజులు గడిచినవి. గృహమునం దేపనులును చేయనవసరములేనందున మహాలక్ష్మి నిత్యమును పతిసాన్నిధ్యమున నుండెడిది. ద్రాక్షారామములోవలెగాక ఏయాటంకములును లేక వారిద్దరి ప్రేమలతలును దినదినమును పెరిగి గాఢముగ నల్లుకొని పోవుచుండెను. శేషమ్మ వారియన్యోన్యానురాగమును చూచిఅమితానంద భరితురాలయినది. ద్రాక్షారామములో మహాలక్ష్మిపడిన బాధలు వినుటచేత నామెకు గలిగిన విచారము మాయమై పోయినది. రోజాకిరోజునూ ఆదంపతులు ద్విగుణీకృత ప్రణయపూరితులై గడుపుచుండిరి. గడియ యెడబాటు వారికి యుగమైపోయినది.

ఇట్లు నెలరోజులు జరిగినవి. ఇంకెన్నాళ్లు రమణారావు మామగారింట్లో నుండగలడు? ఈసంగతిని గురించియే అతడు మహాలక్ష్మితో నిత్యమును ఆలోచించుచుండెను. ఛివరకాతడు రామచంద్రపురముననేయుండిపోయి వర్తకము చేసుకొనుటకు నిశ్చయించెను.

రామచంద్రపురములో జగన్నాథమునకు వేరొక గృహమున్నది. రమణారావాగృహమందుండుటకును ప్రస్తుతము వర్తకమునకు కావలసిన మూలధనమును సాధన సామగ్రిని యిచ్చుటకు జగన్నాథ మొప్పుకొనెను. కూతురును, అల్లుడునూ, ఉన్న ఊరిలోనుందురు కదా యని శేషమ్మ సంతోషించినది. తమపిల్లలు సుఖపడితే యెవరికి సంతోషము ఉండదు?

చెరువుగట్టున జగన్నాథమునకున్న రెండవగృహము చాలసౌఖ్యమైనది. తక్షణం కూలీలనుపెట్టి ఆయింటికి వెల్లవేయించి శుభ్రపరిపించినారు. రమణారావు స్వయముగ నాయింటికి వెళ్లి తగినసౌకర్యము లన్నియును ఏర్పాటుచేసుకున్నాడు. జగన్నాథముగారి ఒంటియెద్దు బండిమీద మహాలక్ష్మి తల్లితోగూడ క్రొత్తయింటికి జని తగిన యిమ్ములన్నియు చూచుకొని పురవాయింపులు చేసినది.

మహాలక్ష్మి ఆనందానికి మేరలేదు. ప్రాణేశ్వరునితో నేకశయ్యపైనుండి భావియోచనలలో నామె తేలిపోయినది.

౬

క్రొత్తయిల్లు తయారైన తరువాత, రమణారావు మామగారితో మరునాటిరాత్రికి వచ్చెదనని చెప్పి కాపురమునకు కావలసినసామగ్రి తెచ్చుకొనుటకు ద్రాక్షారామము బయలుదేరెను.

మహాలక్ష్మి ప్రాణేశ్వరుని పాదపద్మములవంటుకొని తప్పక మరునాటిరాత్రికి రావలెనని ప్రార్థించినది. ఆ ప్రేమమూర్తిని కౌగిలించుకొని ముద్దాడి రమణారావు బండియెక్కెను.

నరసమ్మ కుమారుడు చేసినపనికి ఆగ్రహపరవశురాలై యుండెను. అతడు యింటిలోనికి వచ్చుచున్నపుడామె పలుకరించలేదు. రమణారావు మాత్రము తల్లికి నమస్కరించి "అమ్మా! నా తప్పు క్షమించు. మనశ్శాంతి దొరక్క నేను నీతో చెప్పకుండా యీపనిచేసేను. ఇప్పుడు మనం రామచంద్రపురంపోయి హాయిగా వేరొక యింట్లో ఉండవచ్చును. నిన్ను తీసుకెళ్లడానికి వచ్చేను" అన్నాడు.

నరసమ్మ మారు పలుకలేదు. ఆమె కండ్లలో నీళ్లు ప్రత్యక్షమైనవి. దుఃఖము, కోపము, పుత్రప్రేమ ఒక్కమారుగ నామెహృదయమున ముప్పిరిగొన్నవి. ఆమె కొంతసేపట్లు ఊరుకొని చివరకు మనస్సు నిశ్చయముచేసుకొన్నట్లు నిట్టూర్పువిడిచి"నాయనా! వెంకట్రమణా! లేక లేక ఒక్కబిడ్డడవైనందుకు నాకు నువ్వుచేసిన శాస్తి చాలును. యింకోకొడుకు నాకున్నట్లయితే నువ్వునన్నిల్లా దుఃఖపెడతావా? నీకు నాకం[illegible]ము యెక్కువై పోయింది. ముసలిముండనై బ్రతికుండడం నాదే పొరబాటు"అన్నది.

రమ—అమ్మా! నీ వల్లా కోపగించకు. ఇంట్లో ఉన్న పోరుకి మనశ్శాంతి లేక తొందరపడ్డాను. నావల్ల అపరాధం వచ్చింది. క్షమించు.

నర—నీవల్ల అపరాధంలేదు. మొండిదాన్నైనలుగురిలో నూ అవమానంపొందికూడా బతికుండడం నాది అపరాధం. చిన్నప్పటినుంచీ నిన్ను పెంచి పెద్దవాణ్ని చేసినందుకు నాకు ప్రతిఫలం యిది. మొన్న వచ్చిన దాన్ని వెనకేసుకుని దానిముందర నన్ను గడ్డిపరకకింద కట్టేసేవు.

రమ—జరిగిందేదో జరిగిపోయింది. అమ్మా!త్వరగావంట చేసుకుని భోంచేసి మనం రామచంద్రపురం వెళ్లాలి. నేను కరిణీకానికి రెండేళ్లు సెలవుపెట్టేసేను. యీ రెండేళ్లపాటూ మనం అక్కడేవుండి మళ్లావద్దాం.

నర—నాయనా! నాకు నీపెళ్లాం ముందరజరిగిన పరాభవం చాలు. యింకా నీఅత్తవారందరిముందరా అవమానం పొందడానికా నేను రావడం? నేను మాత్రం అక్కడికి రానుసుమా!

రమ—ఇంక యెంతచెప్పినను తల్లిరాదని నిశ్చయించి "అమ్మా! సరే! నీయిష్టమెలాగో అలాగే కాని—నేనిప్పుడు కొంతపాత్రసామాను ప్రస్తుతం నాఅవుసరం కోసం పట్టుకెళ్లాలి. ఏమేం పట్టుకెళ్లమంటావో చెప్పు—" అన్నాడు.

నర:—యిక్కడ కాపురంఉండేవాళ్లకే యీసామానుకాని, దేశాలవతలకి తీసుకెళ్లడానికి వీలులేదు. నిన్ను రామచంద్రపురంలో ఉండమని యెవరుచెప్పిపెట్టేరో వాళ్లే నీకుసామానుకూడా యిస్తారు.

రమ:—అమ్మా! నువ్వు అలాగంటే నేనేంచెప్పేది? నేను తప్ప యింకెవరు నీసామాను వాడేవాళ్లు నీకున్నారు చెప్పూ? దయదలిచియిస్తే ఒక్కక్షణమైనా పోకుండా తీసుకొచ్చేస్తాను—"

నర:—అబ్బాయీ! నా కిన్నిమాటలు పనికిరావు. నువ్వు యిక్కడ ఉం[illegible]డు—లేకపోతేమానీ— కాని సామానుమాత్రం [illegible]ంచి కదపడానికి వీలులేదు.

రమణారావు శాంతవచనము లెందుకును పనికిరాలేదు. అతడెంత ప్రార్థించినను నరసమ్మ మనస్సు కరిగినది కాదు. చివరకతనికి కోపమువచ్చినది. ఎంతసేపని ఓర్చుకొనఁగలఁడు?

"అమ్మా! నీ అనుమతిలేకుండా యేపని చెయ్యడానికి యిష్టంలేకనే నింతసేపు నిన్నుప్రార్థించేను. కన్నకొడుకునైన నాసుఖం నువ్వుఆలోచించలేదు. పెద్దదానవు నీకింతకార్పణ్యం తగదుసుమా! మా నాన్నగారి ఆస్తికి నీకెంత హక్కున్నాదో నాకూ అంతే ఉన్నది. నాకుకావలసిన సామాను నేను తీసుకెళ్లకమానను."

కొడుకుజవాబు నరసమ్మకు ఆశ్చర్యంకలిగించినది. అంతధైర్యముగా జవాబుచెప్పునని యామె యనుకొనలేదు. ఆమెకోపాగ్నికీమాట లింధనములైనవి. "సరే! తీసుకెళ్లు.ఎంతతీసుకెళతావో చూస్తాను"అని యామెయన్నది.

౧౦

ఈసంభాషణ అయినతర్వాత రమణారావు తల్లిమాటలు వినకుండనే వీథిలోనికి పోయెను.కుమారుడు పైకి దాటినవెంటనే నరసమ్మ కొంతసేపు దీర్ఘాలోచనలో మునిగిపోయినది. [illegible]వసంఘర్షణచేత నామెముఖ మెర్రబడిపోయెను. ఆమె కనుగొలుకులయం దశ్రులుచిమ్మినవి.

పుట్టినదిమొదలుంగ తలిదండ్రులవద్దను అత్తవారింటనుగూడ నరసమ్మయాజ్ఞ నిరాఘాటముగ కొనసాగుచుండెడిది. అట్టి యామెకు నేటి ఎదిరింపుమాటలు శూలములై తాకినవి.

ఆదీర్ఘాలోచననుండి ఎట్టకేల కామె లేచినది.ఆమెముఖమందొక సునిశ్చల భావము ప్రస్ఫుటమగుచున్నది.సర్వప్రపంచసంబంధమును వదులుకొనిన నిర్భయురాలి వలె నామె కనబడుచుండెను. ఆక్షణమున నామె ముఖలక్షణములు భయంకరములై యుండెను.

నరసమ్మ త్వరితగతిని లేచి వీథితలుపు బిగించినది. లోపలయింటితలుపులకు లోపలనే గడియలు వేసినది. వెంటనే పెరటిలోనికిపోయి, నడుమునకు కట్టు బిగించుకుని "గుభాలు"న నూతిలోనికి ఉరికినది! ఆగంభీరశబ్దము అప్పుడే యింటికిచేరుకొనుచున్న రమణారావు విన్నాడు. అతిసాధుహృదయుడైన యువకుడాతడు. "ఏదోప్రమాదం జరిగిందికా" అనుకున్నాడు. వీథిద్వారముదగ్గరకు పోయిచూడగా నది లోపలబిగించియున్నది.దీనితో అతని యనుమానము మరింత దృఢమైనది. వెనుకముందు లాలోచించకుండప్రహరీగోడ నొక్కదాటునదుమికి పెరటిలో

బడినాడు. అతఁడు నూతిలోనికి తొంగిచూచుసరికి, యింకే మున్నది? తల్లి నూతిలో కొట్టుకొనుచుండుట చూచినవు డతనికి ధైర్యమాగినదికాదు. నూతిగిలకమీఁద సన్నని చేంత్రాడు వ్రేలాడుచున్నది. ఆత్రాడు తనబరువును ఆపఁ గలదా? లేదా? యనుసందేహ మాసమయమున నతనికి తోఁచలేదు. "అమ్మా" యని కేకవైచి తక్షణ మాత్రాడు పట్టుకొని నూతులోనికి దిగజారినాడు. త్రాడు తెగి

"అమ్మా! యని కేకవైచి...నూతులోనికి దిగజారినాడు."

పోయినది. రమణారావు "గుభాలు"న నూతిలో పడి పోయెను.

రమణారావున కీఁతరాదు. నూతిలో రెండునిలువు లకుపైగ నీరున్నది. నూతిగోడకు మెట్లులేవు. తల్లిని రెండుచేతులతోడను గట్టిగా పట్టుకొనినాఁడతండు. తల్లి యూ, కొడుకును ఒకరినొకరు పట్టుకొని, మునుఁగుచుఁ దేలుచు చివరకు ప్రాణములను వదలివేసి అడుగుబట్టి పోయిరి. వరసమ్మ మూర్ఖత్వము రెండుప్రాణములతో శాంతించినది.

*　　*　　*　　*

సాయంత్రము నాలుగుగంటలైనను యింటి తలుపులు తెరువఁబడకపోవుటఁజూచి యిరుగు పొరుగులవా రనుమానించిరి. రమారమి ఉదయము పదిగంటలప్పుడు నూతినీళ్లలో నేదో శబ్దము విన్నట్లుగా కొందరు చెప్పిరి.

నలుగురు పెద్దమనుష్యులను దగ్గరబెట్టుకొని యిద్ద్వరు యువకులు గోడదాటి వీథిద్వారము తెరచిరి. ఇల్లంతయు నిర్మానుష్యముగ నున్నది. ప్రొద్దుట వంట చేసినజాడలేలేవు. రమణారావు రామచంద్రపురము నుండి తెచ్చినచేతిపెట్టె యింకను వీథిచావడిలోనే యున్నది.

అందరును నూయిదగ్గర కేగి బలమైన పగ్గములతో మనుష్యులను లోపలకు దింపి వెదికించి రెండు శవములను బయటికి తీయించినారు. జననీ బాహుబంధముల జిక్కి రమణారావును, కుమారుని బాహువుల నిమిడి నరసమ్మయును కొయ్యబారి పోయి యుండిరి. ఆ శవములను విడదీయుటకై యచ్చటివా రొనర్చినప్రయత్నము లన్నియు విఫలము లయినవి.

౧౧

*　　*　　*　　*

మహాలక్ష్మి తల్లితో తమ ముందుకాపురము నుగూర్చి యెన్నియో ముచ్చట లాడుచుండెను. "అమ్మా! మాయింట గృహప్రవేశంనాడు మీరంతా భోజనానికి రావాలిసుమా! తరుచు నువ్వూ తమ్ముడూ మాయింటికి మనబండిమీద వస్తూవుండాలి. మీఅల్లుడు యింక ద్రాక్షారం వెళ్లనే వెళ్లరట. రేపే గృహప్రవేశం గనుక యీరాత్రి యే వేళకే నా ఆయన రాకమానరు. ఇక్కడ ప్రవేశించిన తరువాత యెవరిపోరూ లేకుండా రోజూ మిమ్మల్ని అందరినీ చూస్తు సుఖంగా వుంటాము. తమ్ముణ్ని మాత్రం వారంరోజులుపాటు ముందుగా నాదగ్గిరే వుంచుకుంటాను. నాబీరువా, బొట్టుపెట్టె, హార్మోనీపెట్టె, పుస్తకాలుఅన్నీ అప్పుడేసర్దీసుకున్నాను. కోడికూసినప్పుడు లేచితలంటుకుని బయలుదేరాలని నాన్న చెప్పినారు. ఈవాళే ఆయింటికి తోరణాలు కట్టించి గుమ్మాలకి పసుపూ కుంకుమా దాసీ వాళ్లచేత నాన్న పెట్టించేరట! అమ్మా! నాపరమటావు

చూడని నేనింక మీకివ్వను. నేనే తీసుకుపోయి పాలు తీసుకుంటాము. ఇన్నాళ్లూ మీరే ఉంచుకున్నారు. యింకా నాకివ్వరా యేమిటి ?"

శేషమ్మ వంటచేసుకొనుచు కుమార్తె ముద్దుమాటలకునూ, అమాయకపు హృదయమునకును ఆనందభరితురాలగుచుండెను. ఆవిడ కూతురును ముద్దుబెట్టుకుని "తల్లీ! నువ్వు వేరింటికాపురం చేస్తూంటే, నేనూ, మీనాన్న తరుచు భోజనానికి వస్తూ ఉంటాములే, హాయిగా ఒక్కపనైనా ముట్టుకోకుండా నీచేతవండించి పెట్టించు కుంటాను. మాఅమ్మా! నువ్వూ, నీ మొగుడూ కాపురం చేస్తూ సుఖంగాఉంటే మాకంతేచాలమ్మా!" అని నిండారుసంతోషముతో నవ్వుచు మారుపలికినది.

పైవిధమగు సంభాషణలతో, హృదయాహ్లాదకరములైన భావియోచనలతో, మహాలక్ష్మి కారోజు పగలంతయు క్షణంలో గడిచిపోయినది. రాత్రి యెనిమిదిగంటలైనది.

సాయంత్రమగుటతోడనే మహాలక్ష్మి చక్కగ నలంకరించుకొని ప్రాణేశ్వరుని రాకకెదురుచూచుచుండెను. నాటిరాత్రి భర్తతో తానుముచ్చటించవలసిన భాగములను సరిచేసుకొనుచు పడకగదిలో పందిరిమంచముపై నామె శయనించియుండెను. సర్వప్రపంచమును ఒక స్వర్గమువలె నామెభావనాదృష్టికి గోచరించుచుండెను

ఇంతలో జగన్నాథము ఇంటిలోనికివచ్చి "అమ్మాయీ! భోజనానికి రాఅమ్మా, రమణారావింకారాలేదు. రాత్రి భోంచేసి బండికట్టించుకుని వస్తాడేమో మరి. మనకేం పైవాడా యేమిటి? కనిపెట్టుకుని కూర్చోనక్కరలేదు. దా, అమ్మా" అన్నాడు.

మహా—నాన్నా! మీరంతా భోంచెయ్యండి. యీలోపుగావస్తే యిద్దరమూకలిసి భోంచేస్తాము. లేదా, నేనూ అమ్మా తింటాము.

సరేకదా అనుకుని జగన్నాథము భోజనమునకు కుమారునితోగూడ లేచెను.

మహాలక్ష్మి భర్తరావడమే తడవుగ ఆలస్యము కాకుండ భోజనమునకు లేచుటకై యాతని పట్టుపంచను పెట్టెలోనుండి పైకితీసి దండెముపై సిద్ధముగానుంచినది. గదిలోనున్న నిలువుటద్దము ముందుకు బోయి తన అలంకారములన్నియు సరిగానున్నవో లేవో చూచుకొని ఆనాటి తనయందమునకు తనలో తనేమురిసిపోయినది. భర్తకొరకు తను జడవేసుకొనగా మిగిలిన మగిలిన మల్లెపూలతో నొకదండగూర్చి పరుపుపై నుంచినది. ఆహా! ఏమి మధురభావప్రపంచమున విహరించుచున్నది మన మహాలక్ష్మి!

౧౨

రమారమి తొమ్మిదికావచ్చినది. జగన్నాథము భోజనము ముగించిలేచెను. ఆతడు తాంబూలము వేసుకొనుచు వీథివసారాలో నొకకుర్చీపై గూర్చొనియుండెను. నరసింగరావు గదిలో కూర్చొని చదువుకొనుచుండెను. శేషమ్మ యింక అల్లుడు రాడని నిశ్చయించి కుమార్తెను భోజనమునకు పిలుచుటకయి యివతలకు వచ్చినది. మహాలక్ష్మి రాత్రి తొమ్మిదిగంటలైననూ భర్త రానందుకు కారణమరయుచు శయనించియుండెను.

ఇంతలో వీథిగుమ్మమువద్ద నెవరో గట్టిగ తలుపు తట్టినశబ్దము వినవచ్చినది. తక్షణము మహాలక్ష్మి శయ్యనుండిలేచి "అమ్మా! అదుగోనే అల్లుడొచ్చేరు, యీవేళకి రారనిచెప్పేవే" అని చేతులో "హరికేన్" లాంతరు పట్టుకొని ఒక్కదాటున వీథివసారాలోనికి వచ్చెను.

జగన్నాథము "ఎవరువారు? అవతల?" అని గంభీరముగా ప్రశ్నించెను.

"మాది ద్రాక్షారం బాబూ" అని అవతలనుండి జవాబు వినవచ్చినది.

మహా:—అదేమిటినాన్నా! అలాగడుగుతారు? బండీ వచ్చింది. తలుపుతియ్యండి" అన్నది.

జగన్నాథము తలుపు తీసినాడు. మహాలక్ష్మి భర్తృసందర్శనలాలసయై గుమ్మము దిక్కు చూచుచుండెను. శేషమ్మ అల్లుడువచ్చుచుండెనని యచ్చటనే నిలచియుండెను. "బావ వచ్చేడా యేమిటి?" అని అడుగుచు నరసింగరావు చదువుమాని లోపలినుండి వచ్చినాడు.

అప్పుడొక నల్లనిలావుపాటిమనిషి లోపల ప్రవేశించెను.

"ఏమోయ్! రామస్వామి! బండి యింతరాత్రిదాకా ఉండేమిటి?" అని మహాలక్ష్మి చిరపరిచితుడగు నాపురుషుని ప్రశ్నించెను.

రామస్వామి మారుమాటాడక జగన్నాథము చేతికొక జాబిచ్చి "బాబూ! ఉత్తరం సిత్తగించండి. అన్ని సంగతులూ తెలుస్తాయి" అన్నాడు.

జగన్నాథము కవరుచింపి జాబు చదువుచున్న కొలదియు నాతనిముఖము వివర్ణమైపోవుచుండెను. ఆతని కణతలు కొట్టుకొనుచుండెను.

ఉత్తరము ముగించి ఒక్కక్షణమాత్రము గాఢముగ నాలోచించి "ఒశేయ్! నువ్విలారా!" అని భార్యను లోపలికి పిలిచి చెవిలో నేదియోచెప్పి "నువ్వు ధైర్యంగా ఉండాలి సుమా! లేకపోతే పిల్ల చచ్చిపోతుంది" అన్నాడు.

శేషమ్మ "ఇంకేంధైర్యం, నాయనో" అని ఒక్క అరుపరచి నేలపై గుభాలున పడిపోయినది. ఆమె రోదన ధ్వనులు మిన్నుముట్టుచుండెను. ఇదంతయు క్షణములో జరిగిపోయెను.

ఈ అడావిడిచూచి మహాలక్ష్మి లోపలికి పోయినది. నిముషములో సంగతులన్నియును ఆ నిర్భాగ్యురాలికి తేలిసిపోయినవి. ఇంకేమున్నది? మహాలక్ష్మి 'అమ్మో' అని మొదలునరకిన వృక్షమువలె నేలపైబడి పోయినది. ఆమె నోటినుండి మరి మాట రాలేదు. ఆమె హృదయ వ్యథయంతయును "అమ్మో" యను నార్తనాదమున నిమిడిపోయెను.

ప్రాణేశ్వరునితోగూడి నాటిరాత్రి యనిర్వచనీయానంద మనుభవించి సుఖప్రద మగు జీవనము గడుప నిశ్చయించుకొనుచు భావికల్పనల జేసుకొనిన సరళహృదయ— శుద్ధసాత్వికమూర్తి— మహాలక్ష్మి— నాటి రాత్రియే— హఠాత్తుగా దుర్భరవైధవ్య దుఃఖమున నాజన్మాంతము గడపవలసివచ్చినది.

హావిధీ! నీకల్పన లచింత్యములు—అమానుషములు—అద్వితీయములు !!

* * * *

మహాలక్ష్మి యాశాసౌధము నేలకూలిపోయినది. ఆమెసౌఖ్యలతలు— ప్రేమబంధములు— విచ్ఛేదము లైనవి. ఆమె జీవనద్వారమున నిలిచి విధి కఠోరకంఠస్వరమున భయంకరాట్టహాసము జేసినాడు. మహాలక్ష్మి వినిర్మల జీవనాంబరతలమున కారుమేఘములు క్రమ్మినవి; ఉరుము లురిమినవి; పిడుగులుపడినవి. మహాలక్ష్మి జీవనము దుఃఖభాజనమై పోయినది.

* * * *

౧౩

కాలము గడిచిపోయినది. ఎవ్వరికొరకును కాల మాగదు. ఈ నిరాఘాటకాలప్రవాహమునబడి కొట్లకొలది జీవననౌకలు, సుడిగుండముల గొట్టుకొనుచు, కెరటములతాకుడున భంగపడుచు, తుదకు మునిగిపోవుచుండును.

ప్రస్తుతపు మహాలక్ష్మి పూర్వపుమహాలక్ష్మికాదు. పూర్వపు మహాలక్ష్మి నవ్వులబండి — సంపూర్ణ వికసిత పద్మపత్రాయతేక్షణ — మహోత్సాహపూరిత సుందరానన—నవయౌవన పరిపోషిత మనోహరాంగి—సర్వజనానందసంధాయిని— నిరంతర హృదయేశ్వర పాదసేవా పరాయణ—మహాసాధ్వి........ప్రస్తుతపు మహాలక్ష్మియో—నిరంతరవిషాదసంజనిత బాష్పధారాకలితలోచన—నిర్భరవైధవ్య దుఃఖనిదాఘ సంతప్త వివశీకృత మ్లానవదన—భర్తృవియోగశోకకారణ కృశీభూతాంగి—అనవరత ప్రాణేశ్వర పవిత్రపాదధ్యాన నిర్వికల్ప సమాధినిష్ఠాగరిష్ఠయగు ప్రణయయోగిని—కఠినోపవాసదీక్షాపరాయణ.

కృష్ణపక్షచంద్రునివలె మహాలక్ష్మి దినదినమును క్షీణించిపోవుచుండెను. ఆ మనోహర సుందరాననమున నవ్వులేదు. కన్నులు లోతుకిపోయినవి. ఒక యమానుష తేజముమాత్ర మామెముఖమున విస్పష్ట మగుచుండెను. నిద్రాహారము లామెకు దూరమైపోయెను. జీవనాధార మగు నాహారముమాత్ర మామె బలవంతమున పుచ్చుకొనుచుండెను. ఆమె చిక్కి శల్యావశిష్టయై చూపరకు భయము గొల్పుచుండెను.

జగన్నాథముగారి పెరటిలోనున్న అంటు మామిడితోటలో నామె తన నివాసమేర్పరచుకొనెను. నూత్న

ఫలించిన శోకదేవతవలె నామె యొక్క చూతవృక్షమూలమున శీతలచ్ఛాయనుగూర్చొని నిరంతర భర్తృసాన్నిధ్యమును గల్పించుకొనుచుండును. తదేకధ్యాన నిమగ్నయగు నాయోగినీమూర్తినిగాంచి తల్లిదండ్రులు గుండెలు పగులునట్లుగ దుఃఖించుచుండెడివారు.

"మూర్తీభవించిన శోకదేవతవలె.........భర్తృసాన్నిధ్యమును గల్పించుకొనుచుండును.

సంవత్సరము గడిచిపోయెను. మహాలక్ష్మిస్థితి బొత్తిగ హీనమైపోయినది. ఆమెకు పరధ్యానము హెచ్చైపోయెను. ఒక్కొకరోజున నామె యీ ప్రపంచములో నున్నట్లే యుండదు. అనాడామె తల్లిదండ్రులెంతపిల్చినను పలుకదు, భోజనముచేయదు, నిద్రపోదు. తనలో తానేదియో యర్థములేనిమాటల నాడుకొనుచుండును.

ఒకనాటిసాయంత్రము మహాలక్ష్మి యథాప్రకారము తోటలో చెట్టుక్రింద గూర్చొని యుండెను. ఆనాటి ఉదయమునుండియు నామెయట్లే తోటలో నుండెను. జననీజనకు లెంత బతిమాలినను ఆమె పలుకలేదు సరికదా, భోజనముకూడ చేయలేదు. అనాడామె కన్నులనుండి అవిరళాశ్రుధార లొలుకుచుండెను.

సాయంకాలము నాలుగుగంటలకు జగన్నాథము వీథిలోనికి పనిమీదపోయెను. శేషమ్మ కుమార్తె దుస్థితికి విచారించుచు వండుకొనుచుండెను. ఆరుగంటలకు నరసింగరావు ఆడుకొని యింట్లోకివచ్చి సోదరిని చూచుటకయి తోటలోనికి పోయెను. అక్కడిస్థితి మామసరి కాతనిగుండె లదరిపోయెను. "అమ్మా! అక్కయ్య పడిపోయిందే" అని కెవ్వున కేకవేసెను.

శేషమ్మ ఒక్కదెంగున తోటలోనికి వెళ్లినది. కుమార్తె నేలపై బడియుండెను. చలనములేదు; ఊపిరి యాడుటలేదు. శరీరము కొయ్యబారిపోయి చలువలు గ్రమ్మియుండెను. పవిత్రతేజమొకటి యామెశుష్కించిన వదనమున నింకను తాండవించుచుండెను.

శేషమ్మ కుమార్తెపై వ్రాలి యేడువసాగెను. మాతృదేవి దుఃఖముపొంగిపొర్లి పోయెను. ఇంక జగన్నాథము సంగతివేరుగ చెప్పనక్కరలేదు. అతడట్లే కూలబడి సంతతధారగ కన్నీరు గార్చుచుండెను.

నిశ్చలధ్యాన నిమగ్నయగు నా ప్రణయయోగిని కనులు మూతలుపడిపోయెను. ఆమహాసాధ్వి—ఆపతిప్రాణ ఆశుద్ధసాత్త్వికమూర్తి—ఆప్రణయ యోగిని—మహాలక్ష్మి—దుఃఖభాజనమగు నిహలోకమునకు స్వస్తి చెప్పినది.

* * * * *

ఏగృహమున నిజనాథునితో గలసి యిహలోక సౌఖ్యముల ననుభవింప నువ్విళ్లూరినదో, ఆయింటి యావరణమున మహాలక్ష్మివంటి వ్యక్తి ప్రశాంతకౌముదీ ప్రవాహమున నిప్పటికిని సంచరించుచుండ చూచిన ట్లిరుగుపొరుగువారు చెప్పుచుందురు.

ద్రాక్షారామమున ఘోరదురంతములు జరిగిన గృహాంగణములందొకముదుసలిస్త్రీ, తలవంచుకొని నిశీథినులందు విహరించుచుండునని యా గ్రామవాసులు చెప్పుదురు. ప్రొద్దుపోయినపిమ్మట నిప్పటికిని ఆ యింటి పరిసరములకు బోవుట కెంతధైర్యవంతుడును భయపడుచుండును.